ప్రజాశక్తి
ఆదివారం 16 ఫిబ్రవరి 2025 5 అనంతపురం





బాలోత్సవంలో ప్రదర్శన చేస్తున్న అనంతపురం గాయత్రి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు



డ్రోన్ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్పర్సన్

పొలాలను బీడుగా ఉంచొద్దు

జిల్లాను ఉద్యానవన హబ్‌గా మార్చేందుకు కృషి
కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతులు తమ పంట పొలాలను బీడుగా ఉంచకుండా ఏదో ఒక పంటసాగు చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. ఆకాశవాణి అనంతపురం కేంద్రం ద్వారా శనివారం ఉదయం జిల్లా పరిషత్ డిఎల్ఆర్‌సి సమావేశ మందిరంలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జెడ్పీ ఛైర్మన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై సమావేశ మందిరానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన జిఎం.పవర్ సప్లయిస్, కోరమాండల్, గ్రామోర్ కంపెనీ, అగ్రిమార్ట్, బాయర్ కంపెనీల స్టాళ్లు, డ్రోన్ యంత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వారి పొలాలను బీడుగా ఉంచుకోకుండా ఏదో ఒక పంట సాగు చేయాలన్నారు. రైతులందరూ వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల వద్దకెళ్లి పంటల సాగుపై అక్కడి సిబ్బందితో మాట్లాడాలన్నారు. రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని తెలియజేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ దేశానికి రైతే వెన్నుముక అని, అలాంటి వారికి అందరం అండగా ఉండాలన్నారు. అనంతపురం ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ జి.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఫిబ్రవరి 15వ తేదీన రైతు దినోత్సవాన్ని ఆకాశవాణి నిరాఘాటంగా నిర్వహిస్తోందన్నారు. అనంతరం జిల్లాలో వివిధ రకాల పంటలు పండించిన 20 మంది రైతులను ఆకాశవాణి కేంద్రం తరపున ఎమ్మెల్యే జ్ఞాపికలను అందించిశాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, సెంట్రల్ సిల్క్ బోర్డు జెడి డాక్టర్ కెపి.కిరణ్ కుమార్, మైక్రోఇరిగేషన్ పీడీ రఘునాథరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటస్వామి, రేకులకుంట పరిశోధన కేంద్ర హెచ్‌ఒడి డాక్టర్ ఎం.విజయ శంకర్ బాబు, శాస్త్రవేత్తలు, రైతుసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారి మనసంతా.. కేరింత



అదే జోరు.. అదే ఉత్సాహం.. బాలోత్సవ వేదికగా రెట్టించిన ఆనందంతో చిన్నారులు ప్రదర్శనలు చేశారు. ఆద్యంతం కేరింతలు కొడుతూ ఒకరిని మించి ఒకరు ప్రదర్శనలు చేశారు. ఆటపాటలు, నృత్యరూపాలు, కళానైపుణ్యాలు, అద్భుతమైన తెలివితేటల నడుమ అనంత బాలోత్సవ ప్రాంగణం మురిసిపోయింది.. కళాత్మక ప్రదర్శనలతో కనులవిందు చేశారు. సైన్స్ ప్రదర్శనలతో అందరినీ ఆలోచింప జేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో అబ్బురపరిచారు. వందలాది మంది చిన్నారులు ఒక్క చోట చేరి 'అనంత' పండుగను కనుల ముందుకు తెచ్చారు. అనంతపురం లలిత కళాపరిషత్, గిల్డ్‌ఆఫ్ సర్వీస్ స్కూల్ వేదికగా జరుగుతున్న అనంత బాలోత్సవం-5లో రెండవ రోజు శనివారం రెట్టించిన ఉత్సాహంతో చిన్నారులు ప్రదర్శనలు చేశారు.

- 2వ రోజూ ఊపుతగ్గని బాలోత్సవాలు
- రెట్టించిన ఉత్సాహంతో పిల్లల ప్రదర్శనలు
- ఆట,పాట సృజనాత్మకత మేళవింపు
- ఆద్యంతం చిన్నారుల మోములో ఆనందం
- బాలోత్సవం నిర్వహణపై హర్షాతిరేకాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంత బాలోత్సవ ప్రాంగణం రెట్టించిన ఉత్సాహంతో 2వ రోజు కొనసాగింది. పిల్లల మోములో ఆనందం, తల్లిదండ్రుల కళ్లల్లో చెప్పలేనంత సంతోషంతో బాలోత్సవ ప్రాంగణం కళకళలాడింది. వేలాది మంది 'అనంత'భావిభారత విజ్ఞాన సంపన్నులు బాలోత్సవ వేదికల మీద సాక్షత్కరించారు. విద్యార్థులు వారి ప్రదర్శనకు అనుగుణంగా అందంగా అలంకరించుకుని ఆకట్టుకునేలా పలు వేషధారణలో చేసిన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో కేరింతలతో ఎల్‌కెపి ప్రాంగణం మార్మోగింది. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతో తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని బాలబాలికలు ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు అలుపూసొలుపు లేకుండా పోటాపోటీగా ప్రదర్శనలు చేశారు. అడకమిక్, కల్చరల్ పోటీల్లో వందల సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వారి తెలితేటలతో అందరినీ ఆకట్టుకున్నారు. డాన్స్ పోటీలు ఉద్రూతలూగించాయి. నాటిక ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. జానపద నృత్యాలు, దేశభక్తి గీతాలు, లఘు నాటికలు క్లాసికల్ డాన్స్, ఏకపాత్రాభినయం తదితర విభాగాల్లో చిన్నారులు చూపిన ప్రతిభ ఆద్యంతం సంబరాన్ని తెచ్చిపెట్టింది. అకడమిక్‌లో వార్త రచన, మ్యాప్, వక్తృత్వ పోటీలు, క్విజ్ తదితర విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొని ప్రతిభాను చాటారు.



పాటపాడుతున్న చిన్నారి

ఆటపాటలూ అవసరమే

కెనెరా బ్యాంకు రీజినల్ ఎజిఎం లారెన్స్

విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు కూడా అవసరం అని కెనెరా బ్యాంకు రీజినల్ ఎజిఎం లారెన్స్ తెలిపారు. 2వ రోజు బాలోత్సవం బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు, గురువులను పిల్లలు గౌరవించాలన్నారు. గెలుపోటములను పక్కన బెట్టి ఇలాంటి పోటీల్లో పాల్గొనేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న అనంత బాలోత్సవ కమిటీకి అభినందనలు తెలిపారు. అనంతరం బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లాతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌బిఎన్ విద్యా సంస్థల కార్యదర్శి నిర్మలమ్మ, ప్రభుత్వాసుపత్రి నర్సింగ్ సూపరింటెంట్ శంకుతల, మానవత రక్తదాతల సంస్థ తరిమెల అమరనాథ్‌రెడ్డి, వీర రాఘవరెడ్డి, నాట్యాగురువు పట్నం శివప్రసాద్, సాయి ట్రస్ట్ అధినేత విజయసాయి కుమార్, రచయిత కంబదూరు షేక్ నబీరసూల్, బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, కమిటీ సభ్యులు ఓతూరు పరమేష్, రమణయ్య, లింగమయ్య, గోవిందురాజులు, కోటేశ్వరప్ప పాల్గొన్నారు.

చిన్నారులకు తోడుగా బాలోత్సవ కమిటీ

బాలోత్సవాలను నిర్వహిస్తున్న బాలోత్సవ కమిటీ చిన్నారులకు తోడుగా నిలుస్తోంది. పోటీల్లో పాల్గొనే పిల్లల పేర్ల నమోదు దగ్గర నుంచి వారి ప్రదర్శన, బహుమతులు అందించేంత వరకు కమిటీ సభ్యులు దగ్గరుండి అన్నీ చూసుకుంటున్నారు. చిన్నారులకు ఎలాంటి కష్టం లేకుండా వాలంటీర్లు వారి ప్రదర్శనలకు సాయం అందిస్తున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన, కార్యక్రమాలను తిలకించేందుకు వచ్చిన వారందరికీ బాలోత్సవ ప్రాంగణంలోనే భోజన వసతిని ఏర్పాటు చేశారు. బాలోత్సవం నిర్వహణ బాగుదంటూ ప్రదర్శనలు చేస్తున్నా చిన్నారులే కాక అక్కడికొచ్చిన జనమంతా హర్షం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న కెనెరా బ్యాంకు రీజినల్ ఎజిఎం లారెన్స్



బహుమతులు అందిస్తున్న అతిథులు

బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రాన్ని విస్మరించిన కేంద్రం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపడం బాధాకరమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున తెలిపారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ శనివారం పట్టణంలోని వినాయక కూడలి నుంచి పాత మున్సిపల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చూపెట్టిన ప్రజావ్యతిరేక ప్రతిపాదనలను ప్రజలందరూ తిరస్కరించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పెద్దల బడ్జెట్ మాత్రమే తప్ప పేదలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ముఖ్యంగా ప్రజల్లో కొనుగోలు శక్తి కుచించుకుపోయిందన్నారు. ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు, విరుద్ధంగా సంపన్నులకు రాయితీలు ఇవ్వడం, ఖర్చుల్లో కోత పెట్టడం గర్హనీయమన్నారు. నిరుద్యోగ సమస్యను విస్మరించడంతోపాటు ఆహార సబ్సిడీలు, వ్యవసాయ రంగం, విద్య, ఆరోగ్యం గ్రామీణాభివద్ధి సామాజిక సంక్షేమంపై శ్రద్ధ చూపలేదన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకానికి అదనంగా నిధులు కేటాయించకుండా ఈ పథకాన్ని పూర్తిగా నాశనం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలను చేస్తోందని మండిపడ్డారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుదలతో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మిక వర్గాన్ని విస్మరించిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ రంగసంస్థలను ప్రయివేటీకరణ చేసే చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు రంగానికి బదలాయించడాన్ని ఆపాలని, బీమ రంగంలో 100శాతం పెంచిన ఎఫ్‌డిఐలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు ప్రాంతీయ కమిటీ సభ్యులు మధు, తిమ్మరాజు, కష్ణ, నాయక్, ఆంజనేయులు, తిప్పేస్వామి, ఎస్ఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

గౌతమిపై యాసిడ్ దాడి అమానుషం

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి - ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అన్నమయ్య జిల్లా మదనపల్లిలో గౌతమిపై యాసిడ్ దాడి చేయడంతోపాటు కత్తితో పొడిచిన గణేష్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఐద్వా, ఎస్ఎఫ్ఐ శనివారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై సమగ్రమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా మదనపల్లి ప్రాంతంలో బ్యూటీపార్లర్‌లో ఉద్యోగం చేస్తున్న గౌతమిని అదేప్రాంతానికి చెందిన గణేష్ రెండేళ్ల నుంచి ప్రేమించాలని వెంట పడుతూ వేధిస్తుండటంతో ఉద్యోగం మానేసి ఇంటి వద్దే ఉంటోందన్నారు. ఈనేపథ్యంలో ఫిబ్రవరి 2న గౌతమి తల్లిదండ్రులు వారి బంధువుల్లో పెళ్లి సంబంధం చూసి నిశ్చితార్థం చేశారన్నారు. ఏప్రిల్ 15న వివాహం చేయాలని కూడా నిర్ణయించారన్నారు. విషయం తెలుసుకున్న గణేష్ గత శుక్రవారం ఉదయం గౌతమి సొంత గ్రామానికి వెళ్లి ఆమె ఇంట్లోకి చొరబడి యాసిడ్‌ను ఆమె నోట్లకు పోసి చంపేసే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. తప్పించుకునే క్రమంలో కత్తితో కూడా పొడిచాడన్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందన్నారు. వెంటనే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకపోతే ఈమధ్యకాలంలో రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినిలపై యుటీజింగ్, ర్యాగింగ్‌తో పాటు అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. వెంటనే హోంమంత్రి ప్రత్యేక దృష్టి సారించి మహిళలు, విద్యార్థులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, ఉపాధ్యక్షులు గిరి, సహాయ కార్యదర్శి శివ, సోము, ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రిక, అశ్విని, రేణుక, తదితరులు పాల్గొన్నారు.



టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

అధికారులు, సిబ్బందిపై దురుసు ప్రవర్తన..!

టిడిపి కార్పొరేటర్ వైఖరిపై కార్పొరేషన్ అధికార యంత్రాంగం అసహనం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎన్నికల ముందు టిడిపిలో చేరిన ఓ కార్పొరేటర్ శనివారం కార్యాలయంలో అధికారులు సిబ్బందిపై చిందులు తొక్కారు. శనివారం నాడు అసిస్టెంట్ కలెక్టర్ ట్రైనింగ్ ముగించుకుని వెళ్లడంతో కమిషనర్ ఛాంబర్ ఖాళీ అయ్యింది. తాత్కాలికంగా అదనపు కమిషనర్ ఛాంబర్‌లో విధులు నిర్వహిస్తున్న కమిషనర్ బాలస్వామి ఖాళీ అయిన ఛాంబర్లో శనివారం ప్రవేశించారు. నూతనంగా ఛాంబర్‌లో అడుగుపెట్టిన కమిషనర్ బాలస్వామి దేవుని ఫొటోలకు నమస్కరించుకుని కుర్చీలో కూర్చోవడానికి సమాయత్తం అయ్యారు. అదే సమయంలో నగరంలోని 11వ డివిజన్ కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్ ప్రవేశించబోగా ఐదు నిమిషాలు వేచి ఉండాలని కమిషనర్ సంకేతాలు ఇచ్చారు. అదే సమయంలో అటెండర్ కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్‌కి కొంతసేపు వేచి ఉండాలని కోరారు. కమిషనర్ ఛాంబర్‌లోకి వెంటనే వెళ్లనీయకుండా అడ్డుకున్నారన్న కోపంతో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ప్రధాన గేటును మూసివేసి కౌన్సిలర్ బైఠాయించారు. కమిషనర్ ఛాంబర్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారని తనను వెళ్ళనీయకుండా చేసిన అటెండర్‌ను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతటితో ఆగక 5000 మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే తాను వారి సమస్యలు పరిష్కరించడానికి కషి చేస్తుంటే తను అవమానిస్తున్నారంటూ దుర్భాషలాడారు. కౌన్సిలర్ తీరుపై కార్పొరేషన్ సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు. తమను ఇష్టానుసారం తిడుతుంటే తామెలా పని చేయాలని ఉద్యోగ వర్గాల్లో ఆగ్రహం వ్యక్తం అయ్యింది. అధికారులు, సిబ్బందిపై దుర్భాషలాడి అసభ్యకరంగా వ్యవహరించిన 11వ డివిజన్ కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్ వైఖరిపై సర్వత్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. కార్పొరేటర్ వైఖరిపై చర్యలు చేపట్టకుంటే నిరసన కార్యక్రమాలు చేపట్టే దిశగా ఉద్యోగ వర్గాలు చర్చిస్తున్నట్లు తెలియ వచ్చింది.

పరిశుభ్రత చాలా ముఖ్యం

'స్వచ్ఛాంధ్ర'లో వక్తలు

ప్రజాశక్తి-పామిడి

పరిశుభ్రత చాలా ముఖ్యమని, పరిశుభ్రత పాటించడం వల్ల రోగాలు దరిచేరవని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని వంకరాజుకాలవ గ్రామంలో ఉన్న సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అక్కడిన నుంచి ఆయుష్మాన్ భారత్ హెల్త్, వెల్నెస్ సెంటర్‌ని పరిశీలించి చెత్త తొలగించారు. తర్వాత వెల్నెస్ సెంటర్ నుంచి చెన్నకేశవస్వామి ఆలయం వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంకరాజుకాలవ గ్రామంలో ఉన్న సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ చాలా బాగుందన్నారు. ఇకపోతే పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. ఆలయాలు, చర్చి, మసీదుల తరహాలోనే మన ఇళ్లు, రోడ్లు, దుకాణాలు, కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం క్లాత్‌మిత్రలను సన్మానించారు. తర్వాత వెబ్ ల్యాండ్ సవరణపై ధర్మవరానికి చెందిన సాయి కిరణ్ వంకరాజుకాలవ కాలువ వద్ద ఉన్న 1.95 సెంట్ల పొలానికి సంబంధించి చేసుకున్న దరఖాస్తు విషయమై క్షేత్రస్థాయిలో పొలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్‌డిఓ శ్రీనివాస్, డ్వామా పీడీ సలీమ్‌బాషా, డిపిఓ నాగరాజునాయుడు, జిల్లా పరిషత్ సిఇఓ రామచంద్రారెడ్డి, డిఎల్‌డిఓ విజయలక్ష్మి, తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఓ తేజోష్ణ, సర్పంచు లక్ష్మీదేవి, ఎంపిటిసి సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.



మొక్కనాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కలెక్టరేట్ : పరిశుభ్రత విషయంలో ఇక నుంచి కఠినంగానే వ్యవహరిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. స్వర్ణాంధ్రా-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని 1వ వార్డులో ఎర్రనేల కొట్టాల, మహాత్మా గాంధీ కాలనీల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ముందుగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాలనీలో పరిశుభ్రత చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించారు. తడి చెత్త, పొడిచెత్త వేర్వేరుగా ఇవ్వాలని కోరారు. తర్వాత ఆయుష్మాన్ సెంటర్ వద్ద మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, టిడిపి నాయకులు లాలు, బాబా ఫక్రుద్దీన్, బాలాంజనేయులు, జోగి రాజేంద్ర, చంద్రమౌళి, ఖాదర్, శ్రీనివాసులు, వైకుంఠం రమణ, రాము, రంగా, అల్లిపీరా, ముత్తువలి, సద్దానప్ప, జీలన్, బాబు, గౌస్, ధనుంజయ, సాయి, ముస్తఫా, నాగరాజు, వడ్డే వెంకటేష్, సర్దార్, టైలర్ మాబు రసూల్, వాల్మీకి గణేష్, రాజారావు, పోతుల లక్ష్మీనరసింహులు, పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, ఫిరోజ్ అహ్మద్, సైపుద్దీన్, తొండపునాటి రమేష్, రాయల్ మధు, చరిత, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని డీఎస్పీ రవి బాబు సూచించారు. ఈమేరకు సిఐలు వంశీకృష్ణ, నీలకంటేశ్వర, యువరాజు, ఎస్ఐలతో కలిసి శనివారం పట్టనంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని నంబర్ నుంచి ఫోన్ వస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్ అప్‌డేట్, ఆధార్‌పై ఒటిపి, బ్యాంక్ అకౌంట్ నెంబర్ల లోన్లు తదితర విషయాలను తెలియజేస్తూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తుంటారన్నారు. అలాగే మీ సెల్ నెంబర్‌పై పార్సిల్ వచ్చిందని ఒటిపి చెప్పాలని అడిగితే చెప్పకూడదన్నారు. అలా అనుమానం వస్తే నేరుగా పోలీసులను సంప్రదించాలన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్రలో భాగంగా సర్కిల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు.

శింగనమల : మండల వ్యాప్తంగా ప్రజలు సైబర్ నేరగాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ విజయ్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ఆటో ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అమాయక ప్రజలను ఆసరాగా చేసుకుని కొంతమంది సైబర్ నేరగాళ్లు అకౌంట్లో ఉన్న డబ్బుల్ని స్వాహా చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పుట్లూరు : సైబర్ సురక్ష (మన భద్రత... మన బాధ్యత)లో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా ఎస్ఐ వెంకట నరసింహ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సైబర్ మోసాలు ఎలా జరుగుతాయి.. వాటికి అడ్డుకట్ట వేయాలంటే ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలో.. వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎఎస్ఐ రాజశేఖర్, కానిసేబుల్ అల్తాఫ్ పాల్గొన్నారు.

యల్లనూరు : ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై 'డిజిటల్ ఆటో సురక్ష కార్యక్రమం' ద్వారా శనివారం మండలం అవగాహన కల్పించారు ఈ సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ వివిధ గ్రామాల్లో ఠాం..ఠాం.. వేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు ఆదిరెడ్డి, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ ఈరన్న మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఉత్సవాల్లో మాట్లాడుతున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్

'సేవాలాల్' చూపిన బాటలో నడుద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి-గుత్తి

సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో మనమందరం నడుద్దామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చెర్లోపల్లి గ్రామ పరిధిలో ఉన్న బంజారాల పుణ్యక్షేత్రంలో సేవాఘడ్‌లో సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేవాఘడ్ ఎంతో పవిత్రమైన స్థలం అన్నారు. సేవాలాల్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సేవాలాల్ ఉత్సవాలను పండగల నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చి తమతో అన్ని ఏర్పాట్లు చేయించారన్నారు. ఉత్సవాలకు ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సేవాఘడ్ లో భోజన శాల నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కేటాయిస్తామన్నారు. అంతేగాకుండా ప్రభుత్వం గిరిజన జాతి అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. అనంతరం ఉత్సవాల్లో విధులు నిర్వహించిన ఆర్‌డిఓ శ్రీనివాస్, డీఎస్పీ ఆముదాల శ్రీనివాసులు, డిఎల్‌డిఓ విజయలక్ష్మి, టిటిడబ్ల్యుఒ రామాంజనేయులు ఎంపిడిఓ ప్రభాకర్‌నాయక్, తహశీల్దార్ డి.ఓబిలేసు, మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, సిఐ బి.వెంకటేశ్వర్లుతోపాటు వివిధ శాఖల అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, వర్కింగ్ అధ్యక్షుడు రవీంద్రనాయక్, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్, కోశాధికారి మునినాయక్, తదితరులు

సీజనల్ వ్యాధులపై అవగాహన

యాడికి : మండల పరిధిలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ముందుగా అంగన్వాడీ సెంటర్లో స్వచ్ఛాంధ్రపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాన్ని ప్రజలే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు జీనత్, ప్రమీల, ఆశా కార్యకర్తలు సుభాషిని, నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

అనంతపురం : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర డైరీని ఎస్కెయు వైస్ఛాన్స్లర్ అనిత శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్బాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం అధ్యక్షులు కొనకంటి శ్రీధర్, కార్యదర్శి బాలాజీనాయక్, ఆర్ట్స్ కళాశాల యూనిట్ అధ్యక్షులు చంద్రశేఖర్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యేక ఐడి

యల్లనూరు : వ్యవసాయ శాఖ ఉత్తర్వుల మేరకు రైతులకు ప్రత్యేక ఐడి నెంబర్ కేటాయించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రైతులకు కేటాయించే ఐడి నెంబర్ ద్వారానే ప్రభుత్వ పథకాలకు వర్తిస్తాయన్నారు. కావున రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నెంబర్, ఆధార్కు లింకు అయిన ఫోన్ నెంబర్ను తీసుకుని ఆయా రైతుసేవా కేంద్రాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

18, 19న ఇంటర్వ్యూలు

నార్పల : మండల వ్యాప్తంగా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వివిధ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఈనెల 18, 19వతేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గంగావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో ఆధార్కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రాలతోపాటు చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకుని మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

జిల్లాస్థాయి పోటీల్లో రాయదుర్గం విద్యార్థులు

రాయదుర్గం : రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన జిల్లాస్థాయి ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు బహుమతులు సాధించారు. కళాశాలలో మొదటి సంవత్సరం సిఇసి చదువుతున్న హరిత ద్వితీయ బహుమతి, ఎంఎల్టి చదువుతున్న అరుణకుమార్ తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపల్ టి.విజయలక్ష్మి తెలిపారు. ఈమేరకు ఆయా విద్యార్థులు ఎస్పీ, జిల్లా వృత్తి విద్యాధికారితో సర్టిఫికెట్, మెమెంటో అందుకున్నట్లు తెలిపారు. ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్తోపాటు అధ్యాపకులు చంద్రమోహన్ అభినందించారు.

17న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

రాయదుర్గం : రాయదుర్గంలోని డ్వామా ఎపిడి కార్యాలయంలో ఈనెల 17వతేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాతిదూలం లాగుడు పోటీలు

గుత్తి : బొలికొండ రంగనాథ స్వామి తిరుణాల సందర్భంగా మండలంలోని తొండపాడు గ్రామంలో శనివారం రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను టిడిపి మండల ఇన్ఛార్జి గుమ్మనూరు నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామచంద్ర యాదవ్, బి.చిన్నారెడ్డి యాదవ్, బి.రంగస్వామి రెడ్డి యాదవ్, బి.లక్ష్మి రంగయ్య, ఎంపిటిసి జింకల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలల పాఠశాల, కేసేపల్లి, పప్పూరు ఉన్నత పాఠశాలల్లో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించినట్లు ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా ఎంత వరకు పూర్తి చేశారు. పిల్లల విద్యాభ్యాసం ఎలా ఉంది.. విద్యార్థుల హాజరు శాతం.. హాజరు శాతం పెంచడానికి తీసుకుంటున్న చర్యలు.. తదితర వాటిపై చర్చించారు. ఆదేవిధంగా మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశాల్లో ప్రధానోపాధ్యాయులు రవికుమార్, నాగేష్, జయరామ్రెడ్డి, వెంకటరెడ్డి, రాధా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిసిపిఎన్డిటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

కలెక్టర్ వినోద్కుమార్


అనంతపురం సమీక్షలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు పరచాలని కలెక్టర్ వినోద్కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాకు సరిహద్దు జిల్లాలైన బళ్లారి, తుమకూరు, చిత్రదుర్గం జిల్లాల వైద్య అధికారులతో పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై పామిడి మండలంలోని వంకరాజుకాలవ గ్రామ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దు జిల్లాలకు ఆనుకుని ఉన్న జిల్లాలోని విడపనకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, గుమ్మగట్ట, బ్రహ్మసముద్రం, కుందుర్పి, కంబదూరు మండలాల్లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం పగడ్బందీగా అమలుపరచాలని ఆదేశించారు. డిఎంహెచ్ఒ ఇబి.దేవి మాట్లాడుతూ ఆయా మండలాల్లోని కొంతమంది స్కానింగ్ సెంటర్లలో ఆడ బిడ్డ, మగ బిడ్డ అని తెలుసుకోవడం కోసం అటువైపు వెళ్లడం, ఆడబిడ్డ అని తెలిసిన తర్వాత అబార్షన్ చేయించుకుంటున్నట్లు తెలిసిందన్నారు. దీన్ని అరికట్టడం కోసం ఆడపిల్లల సంరక్షణ కోసం అటు కర్ణాటక సరిహద్దు వైద్య అధికారులతో సమన్వయం చేసుకుని గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టా పగడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బళ్లారి జిల్లా వైద్య శాఖ అధికారి రమేష్బాబు, చిత్రదుర్గం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వేణు ప్రసాద్, తుమకూరు జిల్లా వైద్య శాఖ అధికారి డా.చంద్రశేఖర్ ఐసిడిఎస్ పీడీ వనజ అక్కమ్మ, వైద్య శాఖ ప్రోగ్రాం అధికారులు డా.యుగంధర్, డా.అనుషా జేమ్స్, డా.నారాయణస్వామి, డా. రవికిరణ్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి గైనకాలజీ విభాగం హెచ్ఒడి డా.శంషాద్ బేగం, చిన్నపిల్లల విభాగం హెచ్ఒడి డా.రవి కుమార్, డిపిహెచ్ఒ గురుమూర్తి శెట్టి, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనా అధికారి గంగాధర్, లీగల్ అడ్వైజర్ ఆశారాణి, లక్ష్మీనారాయణ, విజయ్, వెంకటేష్, కిరణ్, శ్రీకాంత్, కర్ణాటక అధికారులు పాల్గొన్నారు.

అనంతపురం : స్థానిక అనంతపురం డివిజన్ రెవెన్యూ అధికారి కేశవనాయుడు అధ్యక్షతన గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఒ మాట్లాడుతూ అనంతపురం డివిజనల్ స్థాయిలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్స్పెక్టర్ హనుమన్న, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డాక్టర్ శంకర్నారాయణ, డిపిఆర్ఒ గురుమూర్తి, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనా అధికారి గంగాధర్, ఆశారాణి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డిఒ వసంతబాబు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఆర్డిఒ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై డివిజనల్ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై ఆశా కార్యకర్తలు, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్ల ద్వారా వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్ శాఖలు సమన్వయం చేసుకుంటూ అవగాహన కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఆడపిల్ల ప్రాముఖ్యతను వివరించాలి. స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న డాక్టర్లు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే సెంటర్ను సీజ్ చేస్తామన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజేష్కుమార్ మాట్లాడుతూ హైస్కూళ్లు, కెజిబివిలు, ప్రయివేటు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రసన్న భారతి, కమిటీ సభ్యులు డాక్టర్ జమీలా, డాక్టర్ దేశం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ స్వప్న, ఆర్డీటీ వైద్యులు, సిడిపిఒ ప్రసన్న, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

క్రమ-శిక్షణతో విద్యను అభ్యసించాలి

జెఎన్టియు ఇన్ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు



మాట్లాడుతున్న జెఎన్టియు ఇన్ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్టియు అనుబంధ కళా శాల తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థలో విద్యను అభ్యసించే విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జెఎన్టి యు ఇన్ఛార్జి ఉపకులపతి హెచ్. సుదర్శనరావు పిలుపునిచ్చారు. శనివారం ఒటిపిర్ఐ డైరెక్టర్ జివి.సుబ్బారెడ్డి అధ్య క్షతన ఒటిపిర్ఐ 2024వ బ్యాచ్ ఫార్మా-డి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఫార్మా-డి. కోర్సుకు ఎంతో విశిష్ట ప్రాధాన్యత ఉందన్నారు. అందుకు తగ్గట్టుగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, ఫార్మా-డి హెచ్ఒడి ఇ.పవన్కుమార్ పాల్గొన్నారు.

'యుజిసి డ్రాఫ్ట్-2025'ను వెనక్కి తీసుకోవాలి

వైఎస్ఆర్ఎస్యూ అధ్యక్షులు చంద్రశేఖర్యాదవ్




మాట్లాడుతున్న వైఎస్ఆర్ఎస్యూ అధ్యక్షులు చంద్రశేఖర్యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం

కేంద్రం యుజిసి డ్రాఫ్ట్-2025 నోటిఫికేషన్ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని వైఎస్ఆర్ఎస్యూ అధ్యక్షులు చంద్రశేఖర్యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం వేలువరించిన యుజిసి నోటిఫికేషన్లో ఉన్నత విద్యావ్యవస్థలో ఊహించడానికి కూడా సాధ్యం కాని మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో అత్యంత కీలకమైన వైస్ ఛాన్స్లర్ల నియామక నిబంధనలను పూర్తిగా మార్చి అన్ని అధికారాలు గవర్నర్లకు అప్పగించాలని చూడటం బాధాకరమన్నారు. ముఖ్యంగా విద్యాపరమైన అర్హతలను సడలించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. కావున ఎన్డిఎ ప్రభుత్వం స్పందించి యుజిసి డ్రాఫ్ట్-2025 నోటిఫికేషన్ను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నగర అధ్యక్షులు కైలాష్, నాయకులు వెంకట్, బోయ నితిన్, రాహుల్రెడ్డి, బోయ శ్రీనివాస్, శివ, శారిక్, సూర్యారెడ్డి, సురేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ కాదు.. డూపర్ సిక్స్'

హామీల అమలుకు పోరాడుతాం-మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు

ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక డూపర్ పథకాలుగా మార్చారని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. త్వరలో జమిలి ఎన్నికలు రానున్నాయని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వానికి డిపాజిట్లు దక్కవన్నారు. ఉచిత వంటగ్యాస్ మొదలుకుని తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, 18 ఏళ్ల పైబడిన మహిళలకు నెలకు రూ.1500, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ వంటి అనేక హామీలపై కూటమి ప్రభుత్వం మాట తప్పిందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేదాకా ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. ఇకపోతే ఆరోగ్యరీత్యా నాలుగు నెలలుగా హైదరాబాదులో చికిత్స తీసుకుని తిరిగి గుంతకల్లుకు వచ్చిన సందర్భంగా శుక్రవారం కార్యకర్తలు, నాయకులు తనపై చూపించిన ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని అన్నారు.ప్రతి కార్యకర్తకూ అన్నివిధాలా ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు యుగంధర్రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఖలీల్, మండల అధ్యక్షులు రాము, కౌన్సిలర్లు లింగన్న, సుమో బాషా, ముస్లిం మైనార్టీ నాయకులు నూర్ నిజామీ, ఫ్లయింగ్ మాబు, నాయకులు గోవింద్నాయక్, జయరామ్రెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బాసిద్, తదితరులు పాల్గొన్నారు.

'5-30గంటలకు అటెండెన్స్ లాక్ బాధాకరం'

ప్రజాశక్తి-అనంతపురం

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల ముగింపు సమయం 5 గంటలకే ఉన్నప్పటికీ 5:30 వరకూ అటెండెన్స్ పడకుండా లాక్ చేయడాన్ని ఎస్టియు జిల్లా అధ్యక్షులు ఎస్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. తద్వారా గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో హాజరైన ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అంతేగాకుండా ఉదయం ఎప్పుడో ఐదు గంటలకు ఇంట్లో బయలుదేరినప్పుడు ఫోన్ ఛార్జింగ్ పెట్టి ఉంటారని, సాయంత్రం 6 గంటలైనా అటెండెన్స్ తీసుకోకపోతే ఛార్జింగ్ ఉండే అవకాశం ఉండదన్నారు. ఛార్జింగ్ లేకపోతే అటెండెన్స్ వేయడానికి వీలు కాదన్నారు. ప్రభుత్వం తక్షణమే ఇలాంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఒలింపియాడ్లో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

యూనిఫైడ్ ఇంటర్ నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్లో స్థానిక సంఘమేష్ నగర్లోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. దాదాపు 80వేల మందికి పరీక్షల నిర్వహించగా మాంటిస్సోరి విద్యార్థులు 6, 11, 16, 20, 24, 26, 27, 31, 33, 35 ర్యాంకులు సాధించారు. ఇందులో భాగంగా స్వర్ణ పతకాలు, నగదు ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ అచీవర్స్గా గుర్తింపు పొందడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత.. మన బాధ్యత..

ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు



మాట్లాడుతున్న పూల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ


రోడ్డు బాధ్యతను ప్రతి ఒక్కరూ మన బాధ్యతగా తీసుకోవాలని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రీజినల్ మేనేజర్ సుమంత్ ఆదోని అధ్యక్షతన శనివారం అనంతపురంలోని గ్యారేజీలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వి.శ్రీనివాసరావు, రీజినల్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ బి.సురేష్నాయుడు, డిప్యూటీ చీఫ్ సిటిఎం శ్రీలక్ష్మి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ మేనేజర్ రమేష్బాబు, ఆర్ఎం ఆఫీస్ పిఒ చంద్రాయుడు, లా ఆఫీసర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : రోడ్డు భద్రతతోనే కుటుంబాలకు భరోసా సాధ్యమని ఆర్టిఒ శ్వేతబిందు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సీఐ యువరాజుతో కలిసి శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణ పోలీస్స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ టీ సర్కిల్, వాల్మీకి సర్కిల్, ఆర్డిటి ఆసుపత్రి ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆర్టిఒ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. ముఖ్యంగా మద్యం తాగి, సెల్ఫోన్లో మాట్లాడుతూ వాహనాలను నడపరాదన్నారు. కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం అన్నివిధాలా చిన్నాభిన్నం అవుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. అంతేగాకుండా వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్తోపాటు వాహనాలకు సంబంధించిన రికార్డులను వాహనాల్లోనే ఉంచుకోవాలన్నారు.

పౌర సరఫరాల వాహనం తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్ : శెట్టూరు మండలం బచ్చేహళ్లి గ్రామంలో పౌర సరఫరా సరుకులను సరఫరా చేస్తున్న ఎండియు వాహనాన్ని ఆర్డిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సరుకుల సరఫరాలను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా సమయానికి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కాసుల వెలుగులు..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రకృతి వైపరీత్యం ఇక్కడి ప్రజలకు శాపమయితే... కార్పొరేట్లకు మాత్రం కార్పొరేట్ వెలుగులను పంచిపెడుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా భౌగోళికంగా ఎత్తైన ప్రాంతం కావడంతో గాలులు నిరంతరంగా వీయడంతో కురవాల్సిన మేఘం కురవకుండా సుదూరం పోతోంది. దీంతో వర్షాలు సరిగా లేక ఇక్కడ వ్యవసాయంపై ఆధారపడిన రైతాంగం పూర్తి స్థాయిలో నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఈ శాపమే కార్పొరేట్లకు మాత్రం వరంగా మారింది. బలమైన గాలులకు పవన విద్యుత్ ఉత్పత్తి జోరుగా సాగుతుండగా, వర్షాల్లేకపోవడంతో ఉండే ఎండ సౌర విద్యుత్ ఉత్పత్తికి అనుకూలంగా మారింది. దీంతో ఎక్కడాలేని విధంగా పెద్దఎత్తున న్యూ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు వస్తున్నాయి. దీని వలన స్థానికంగా ఉపాధి లభిస్తుందా అంటే పెద్దగా ఉండటం లేదు. పైగా వీటి ఏర్పాటు భూములు పెద్దఎత్తున సేకరిస్తుండటంతో రైతు భూమిని కోల్పోయి ఇతర పనుల్లోకి వెళ్లే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే చాలా వరకు చూస్తే పవన, సౌర విద్యుత్ ప్లాంట్స్ ఏర్పాటు చేసియున్నారు. ఇప్పటి వరకు ఏర్పాటైన వరకు చూస్తే ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1779 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు అయ్యాయి. 3003 మెగావాట్ల పవన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటికి ఒక మెగావాట్కు నాలుగు నుంచి ఆరు ఎకరాల భూమిని ఆ సంస్థలు సేకరిస్తున్నాయి. దీని ప్రకార చూస్తే ఇప్పటి వరకు సేకరించిన భూమియే సుమారు 20 వేల ఎకరాల వరకు ఉంది. ఇప్పుడున్న వరకే కాకుండా మరిన్ని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులిచ్చియున్నారు. వీటికి సుమారు మరో 20 వేల ఎకరాలకు ఉన్నాయి. ఇంకా వచ్చే అవకాశముంది. ఈ ప్రకారం జిల్లాలో పెద్దఎత్తున భూసేకరణ విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు కేటాయించే అవకాశముంది. గతంలో లాగా నేరుగా కొనుగోలు కాకుండా లీజు పద్ధతిలో రైతుల నుంచి సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం చూస్తే ఎకరానికి రూ.31 వేలు ఏడాదికి ఇవ్వాలని నిర్ణయించింది. ఆయా సంస్థలకు మాత్రం విద్యుత్ ఉత్పత్తి చేసి విక్రయించడం ద్వారా కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరుతోంది. రైతుకు మాత్రం భూమి లేకుండాపోతోంది. తద్వారా రైతుకు ఉపాధి లేని పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా ఈ వారంలో విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు కేటాయించిన భూముల చూస్తే సత్యసాయి జిల్లా ముదిగుబ్బ ప్రాంతంలోనూ, కనగానపల్లి, రామగిరి, కళ్యాణదుర్గం, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు అనుమతులిచ్చింది.. ఈ రకంగా ప్రకృతి రైతుకు శాపమవుతే... కంపెనీలకు మాత్రం కాసులు కురిపించేదిగా మారింది. లీజు ఏడాదికి రూ.31 వేలు కాకుండా మరింత పెంచాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆదాయంలో వాటి ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

ఇంజినీరింగ్ అధ్యాపకులకు అవార్డులు


అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి

అనంతపురం : స్థానిక జెఎన్టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగాధిపతి కె.కళ్యాణిరాధ, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.ఓంప్రకాష్ బెస్ట్ టెక్నికల్ పేపర్స్ అవార్డులకు ఎంపికయ్యారు. నిట్ (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) రూర్కెలాలో '2వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్నోవేషన్స్ ఇన్ తెరమో ఇంజినీరింగ్ అండ్ సైన్సెస్'లో ప్రదర్శనలు చేసినందుకు అవార్డులకు ఎంపికయ్యారు. అవార్డులు వచ్చినందుకు కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి అభినందించారు.

విద్యుత్ మీటర్ల తనిఖీ

నార్పల : మండల కేంద్రంలోని పలుకాలనీల్లో విద్యుత్ శాఖ ఎడిపి రాధిక ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ మీటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్లను ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరుగుతుంటే తెలుస్తుందన్నారు. తనిఖీలకు వచ్చే విద్యుత్ అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు.

'మిస్టర్ సౌత్ ఇండియా' పోటీలకు రాయదుర్గం యువకుడు


పోటీలకు వెళ్లనున్న దస్తగిరి

రాయదుర్గం : బెంగళూరులో జరగనున్న మిస్టర్ సౌత్ ఇండియా మెన్స్ ఫిజిక్ బాడీ బిల్డింగ్ పోటీల్లో రాయదుర్గానికి యువకుడు దస్తగిరి పాల్గొననున్నాడు. ఈనెల 14 నుంచి 16వతేదీ వరకూ బెంగళూరులోని మాన్యత టెక్పార్క్లోని మన్ఫో కన్వెన్షన్ సెంటర్లో పోటీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం జరగనున్న మిస్టర్ సౌత్ ఇండియా మెన్స్ ఫిజిక్ విభాగంలో రాయదుర్గానికి చెందిన దస్తగిరి పాల్గొననున్నాడు.

'పివికెకె'లో ముగిసిన వర్క్షాప్

అనంతపురం : నగర సమీపంలోని పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్, సిఎస్జి విభాగాలు సంయుక్తంగా ఫుల్ స్టాక్ డెవలప్మెంట్, ఎంబెడెడ్ సిస్టమ్స్పై రెండు రోజులపాటు నిర్వహించిన వర్క్షాప్ శనివారం ముగిసింది. ఇందులో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొని ఆధునిక సాంకేతికతలపై అవగాహన పెంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఇ విభాగాధిపతి దిలీప్ వెంకటకుమార్, ఎం.ధరణికుమార్, వీణా, తదితరులు పాల్గొన్నారు.

17న బడ్జెట్ను నిరసిస్తూ ర్యాలీ


విలేకరులతో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

పామిడి : కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన బడ్జెట్కు వ్యతిరేకంగా సోమవారం నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు వామపక్ష నాయకులు అనిమిరెడ్డి, రహీం తెలిపారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజా సంక్షేమం పట్టడం లేదన్నారు. నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరగుతున్నా నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. అండగా నిలబడుతూ పేదలకు అనుకూలంగా ప్రవేశపెట్టనున్న బడ్జెట్ను పెద్దలకు అనుకూలంగా ప్రవేశపెట్టడం బాధాకరమన్నారు. కేంద్ర బడ్జెట్ను నిరసిస్తూ సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి బిసిసి రోడ్డు మీదుగా ఎద్దులపల్లి సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, వామపక్ష నాయకులు గజ్జెల దస్తగిరి, ఓబయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, ముత్యాలు పాల్గొన్నారు.

సాంకేతిక సదస్సులో గేట్స్ విద్యార్థుల ప్రతిభ

గుత్తి : నంద్యాలలోని ఆర్జియం ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ మెకానికల్ విభాగాలు నిర్వహించిన 'ప్రవాహ 2కె25'-సంకల్ప్ 2కె25' అనే జాతీయ సదస్సులో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను శనివారం స్థానిక కళాశాలలో యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల కరస్పాండెంట్ వికె. పద్మావతమ్మ మాట్లాడుతూ సదస్సులో దేశంలోని 30 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా తమ కళాశాల నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్పో పోస్టర్ పేపర్ ప్రజెంటేషన్లలో ప్రతిభను కనబరిచి ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారని చెప్పారు. అలాగే ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్పో లో ప్రథమ, ద్వితీయ బహుమతులు దక్కయన్నారు. కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎండి రఘునాథ్ రెడ్డి, డైరెక్టర్ శ్రీ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్ బాషా, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న గేట్స్ కళాశాల అధ్యాపకులు

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

పెద్దవడుగూరు : మండలంలోని లక్షుంపల్లి సమీపంలో ఈనెల 12న ద్విచక్ర వాహనంలో వెళ్తూ అడవి పందులను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన నరేష్ (32) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. గుంతకల్లు మండలం కదిరంపల్లికి గ్రామానికి చెందిన ఇతను తన అక్క గ్రామం మల్లేనిపల్లికి ద్విచక్రవాహనంలో వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన ఇతన్ని చికిత్స కోస అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గుంతకల్లులోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తండ్రి కదిరెప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కందిపంట, గడ్డివామికి నిప్పు

పెద్దవడుగూరు : మండలంలోని తెలికి గ్రామంలో అన్నదమ్ములు నాగయ్య, సాంబశివుడుకు చెందిన కందిపంటతోపాటు గడ్డివామికి గుర్తు తెలియని దుండగులు శనివారం నిప్పు పెట్టారు. గమనించిన స్థానికులు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. తద్వారా రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

పెద్దవడుగూరులో ట్రాక్టరులో తరలిస్తున్న జొన్నపంట పశుగ్రాసానికి శనివారం విద్యుత్ నియంత్రిక తగిలి దగ్ధమైంది. గ్రామానికి చెందిన శివారెడ్డి పండించిన జొన్నపంట గ్రాసాన్ని ట్రాక్టర్ సాయంతో ఇంటికి తీసుకొస్తున్న తరుణంలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ నియంత్రికకు జొన్నపంట తగలడంతో మంటలు వచ్చాయి. అయితే అప్రమత్తమైన డ్రైవర్ గ్రాసానికి కిందికి వదిలేందుకు యత్నించాడు. అయినప్పటికీ ట్రాక్టర్లో కొంత గ్రాసం ఉండిపోవడంతో మంటలు అధికమయ్యాయి. డ్రైవరుతోపాటు గ్రామస్థులు మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. గ్రాసం దగ్ధం కావడంతో సుమారు రూ.30వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

విద్యుదాఘాతంతో చీనీ చెట్లు దగ్ధం

యల్లనూరు : మండల పరిధిలోని దుగ్గుపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో చీనీ చెట్లు దగ్ధమైన ఘటన గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేకు.. గ్రామానికి చెందిన రైతు ఇ.గణేష్ తనకున్న నాలుగెకరాల పొలంలో 560 చీనీ చెట్లు, మొక్కజొన్న పంట సాగు చేశాడు. ఈ నేపథ్యంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ హెడ్ఫ్యూజ్కు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. మంటలు మొక్కజొన్నతోపాటు చీనీ చెట్లకు పాకడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. పంటతోపాటు స్ప్రింక్లర్లు, విద్యుత్ ఎల్టి లైన్ కాలిపోయి సుమారు రూ.1.50లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.